# అదృష్టజీవి


రచయిత: "సత్యశ్రీ"

★

రామం, ఆరవ ఫారం మూడు మారులూ కూడ! ఫేలయాడు. పోనీ, యేమీ కష్టపడి చదవలేదేమో! అంటే రాత్రిం పగళ్ళు యిరవైనాలుగు గంటలూ! అదే పనిగా పుస్తకాలన్నీ కంఠస్థంచేసి, విసుగనక ఓపికతో కష్టపడి చదివేడు; కాని, ఫలితం దక్కలేదు. కుంటిశనిగాడు! అదృష్టఫలాన్ని, రెండుప్రక్కలా కొతికితిన్నాడు. శనిదినాల వక్రగమనం, తప్పించటాని కా బ్రహ్మకు మాత్రం శక్యమవుతుందా? బిక్కమొగం పెట్టుకొని, అమ్మా, నాన్న లేంచేస్తారో! అని భయపడుతూ యిల్లుచేరుకున్నాడు. భోజనం చేసి, సావడిలో పేపరు చదువుతూన్న శీతారామయ్య, వాడిపోయిన ముఖలక్షణాల్ని బట్టీ తప్పుచేసినవాడికి మల్లే, ప్రాణాల్ని చేతుల్లో బిగపెట్టుకొని, మెల్లమెల్లగా అడుగు లేసుకొని వస్తూన్న కొడుకునాపి — "ఏం! మళ్ళీ పరీక్ష పిడకలకుచ్చులో మంటకలి పేవా?" అని తండ్రి అడిగినదానికి క్షణికంలో విద్యుత్ ఆగినట్లు, నిల్చున్నచోటే తలవంచుకొని మారుజవాబివ్వకుండా స్థంభించి వుండిపోయేడు.

"చెట్టంత కొడుకువయ్యావు! ఎంతకాలం నిన్నిలా చదివిస్తూ కూర్చుంటానురా? "ఎద్దెండకు — ఎనుము నీడకనే ఖర్మంలా నేనెన్ని శ్రమదమాలుపడి! ధనం వ్యచ్చించి, చదివిస్తూన్నా నువ్వుమాత్రం! ప్రతీ సంవత్సరం ఫేలవడం తప్పలేదు. ఆడపిల్లలంతా యిట్టే చదివి, ఎం. ఏలూ, బి. ఏలూ ప్యాసవుతున్నారు. వీమొఖం స్కూలుఫైనలు ప్యాసవడానికి కూడ నోచుకోలేదు. ఇంత మొద్దుదద్దమ్మవని తెలుస్తే! మొదట్లోనే చదువు చెప్పించడం మానేసేవాణ్ని. ఎంతసేపూ! నాటకంట్రూపువాళ్ళతో తిరుగుతుంటావుట. ప్యాసవమంటే! ఎలాఅవుతావ్? ఫో...ఇహ నీ ఖర్మం! యెలా తగులబడితే అలా తగులడనియ్." అని శీతారామయ్య కోపం పట్టలేక కొడుకుని రెండు కొట్టి గద్దించేడు.

రామం సిగ్గుతో తండ్రి అంటూన్న మాటలకు తలకాయ వంచుకొని, పొరలివస్తూన్న దుఃఖాన్ని, దిగమ్రింగుతూ పది నిమిషాలు కొయ్యబొమ్మలా నిల్చుండిపోయాడు. ఇంతటిలో తల్లి నరసమ్మ వంటింట్లోంచి వచ్చి—



"మళ్ళీ పరీక్ష దగ్ధపటలం చేసేవుట్రా! ఓరి బడుగా! నీకింక చదువబ్బే సూచనలు లేవు. రా భోజనానికి. నెత్తిమీద కొంగువేసుకొని వో మూల పడివుండువుగాని; కష్టపడి చదవంది చదువులంత అచ్చివస్తాయా? ఇంత మొద్దుమొగానివైతే యెలారా? ఆ శంకరంగారి కృష్ణ నీకంటే! సహస్రాంతం చిన్న. సరిగా లాగుకూడ కట్టుకోలేక పోయేవాడు. వాళ్ళమ్మ వాడికన్నీ ముస్తాబుచేసి, మొన్న మొన్నటిదాకా! బడికి దిగబెట్టేది; అట్లాంటి వాడిట్టే ప్యాసయాడు. చిన్నప్పుడేదో చిలుక పలుకులాడితే! పెద్దయ్యేం విరగపెట్తావో అని పొంగిపోయా" మని అనగా శీతారామయ్య—"వాడేమిటే! చిమ్మిరపకాయలాంటివాడు! ప్యాసవడమే కాదు; ఫస్టు క్లాసులో వచ్చాడు. లేకపోతే — మన బ్రబ్రాజమానుడులా! నాటకాలకీ, సినీమాలకీ పరుగెత్తే వాడనుకున్నావా? వాడికి వాళ్ళమ్మా నాన్నలంటే! యెంత భయమో! తెలుసా? నిద్రపోయ్యాడంటే వాళ్ళ నాన్న యెక్కడ మొట్టికాయలు పెడతాడో నని

అదేపనిగా కష్టపడి చదివేవాడు. ఇదుగో మనవాడి బండారం! భూమ్యాకాశాలు పట్టవు! అద్దం ముందు! మూడు గంటలన్నర క్రాఫింగుమాత్రం దిద్ది దువ్వుకొంటాడు. నీటుగా డ్రస్సువేసుకొని, షికార్లకి చలాయిస్తాడు. తల్లిదండ్రుల మాటంటే వో ఖాతరుందా? చిన్నిప్పటినుండీ ముద్దుచేయడంచేత, యింత మొద్దుగా తయారయాడు. ఇహ వీడి గురించి నేనేం బాధపడలే"నని కుర్చీలో చేరగిలాడు.

"పోనీ అయిందేదో అయింది. ఆజీజమాల్ గారి కంపెనీలో యేదైనా వుద్యోగం యిస్తారేమో కనుక్కోండి; నాల్గురాళ్లేనా వచ్చే ఆస్కారం వుంది" అని నరసమ్మన్న మాటలకు శీతారామయ్య మరింత వుగ్రుడై "యీ మొగమేనా! ఆజీజమాల్ కంపెనీలో గుమస్తాపనిచేయగల్గింది? అక్కడ పని అంత తేలికైందనుకున్నావా? ఎంత లేసి తెలివితేట లుండాలో తెలుసా? అక్కడంతా యెకౌంట్సుకి సంబంధించినపని బాగా తెలుసుండాలి. మన గొంగళీపాత్రుడికి లెక్కల్లో వర్తులాకారం గదా! యీడిగ్రీకీ అక్కడ వుద్యోగంకీ, యేమీ సంబంధంలేదు. వుట్టికీ, చట్టికీ కూడ చెడ్డాడంటే నమ్మ. డబ్బంతా శుష్క దండుగయింది. కాదూ పోదూ అంటే నోరు కదల్పటం అంటూ యేమైనా వస్తే ఆ నాటకాల్లోనే తిరుగుతూండాలి. దానికి మాత్రం ధైర్యస్థైర్యాలక్కరలేదూ? లాలిత్యమైన గాత్ర మాధుర్యం కూడా వుండాలి; జంకూ గొంకూలేని, నటనాసామర్థ్యం వుండితీరాలి. యీ పెద్దమ్మ! ఆపనిలో కూడ నెగ్గలేడు. వీడికంటే పొదిపట్టే రామిగాడేనయం" అని పండ్లు కొరుకుతూ, కోపం పట్టలేక రామాన్ని మరి నాల్గు లెంపకాయలుకొట్టి ఆఫీసుకి వేళవటంచేత, శీతారామయ్య వెళ్ళిపోయేడు. "రారా! యేడుపేంటి? భోజనానికి రా!" అని కసురుతూ వంటింట్లోకి వెళ్ళిపోయింది తల్లి.

తల్లి దండ్రులచేత, నానా చీవాట్లూ తిని, బెల్లంకొట్టిన రాయిలా, నోట మాటరాక, అలానే నిల్చున్నచోటనే స్థంభించి వుక్కిరిబిక్కిరిగా వుండిపోయాడు. ఒకప్రక్క పరీక్ష పోయిందనీ, తండ్రి కొట్టేడనీ, ఆవేదనతో కన్నీరు బొటబొట కారుస్తూంటే తాతయ్యవచ్చి "దా! బొజ్జీ దామ్మ దా! భోంచేసిరా! ఏడవకు నిన్నిలా నవ్వినందుకు చూడు వాళ్ళయెదుటే నీవెంత సుఖపడ్తావో నవ్వినూళ్ళు! పట్టణాలవకపోతాయా? అదృష్టాన్ని అడ్డేవారు లేరు. లే! ఏడవ"కని బుజ్జగించి వంటింట్లోకి తీసుకువెళ్లేడు.

* * *

స్కూలుఫైనలు మూడు ఛాన్సుల్లోకూడ నెగ్గలేక, యింట్లోవారికీ, పైవారికీ కూడ, గడ్డిపరకకంటే కనాకష్టంగా గోచరించాడు రామం. లోకంలో తనిప్పుడెవ్వరి కుపయోగపడతాడు? తోటిస్నేహితులూ, పెద్దలూ, చిన్నలూ! ఆఖరికి దాసీపనివాళ్ళు సైతం "పరీక్ష పోంగొట్టుకున్నావా! నాయనా!" అని పరామర్శచేసేరు. యింట్లో! అమ్మానాన్నలు కొట్టిన దెబ్బలకూ, తిట్టిన తిట్లకూ సహించలేకపోయేడు. క్షణికకాలం ఆ పరిసరాల్లో మెలగటం కష్టంగా తోచిందాతనికి. నలుగురియెదుట తలెత్తుకొని తిరగటం ఎంతో సిగ్గనిపించింది. ఏవ్యక్తైనా వుద్యోగం సంపాయించాలన్నా సుఖంగా జీవించాలన్నా ఉన్నత పరీక్షలు ప్యాసయినట్లు సర్టిఫికేట్లుండాలి. తను యీలోటుతో వెళ్తే, యెవరు పిల్చి వుద్యోగమిస్తారు? లోకంలో జీవించి వున్నందుకు ఫలితం యేంటి? ఫలానా అబ్బాయి! యిట్లాంటి యోగ్యత కలవాడని పించుకొని, పేరు తెచ్చుకొనే విలువవుండాలి. తాతయ్య చెప్పినట్లు ధనం సంపాయించి మంచి వున్నతస్థానం పొందటానికి యోగ్యతాపత్రాలు, సర్టిఫికేట్లూ అక్కర లేదని తల్చాడు. తన అదృష్టరేఖ బయలుపడితే ధర్మచక్రం చూపిన నాల్గు పాదాలు సక్రమంగా నడుస్తూంటే సుఖం అంటూ అనుభవించకపోతానా? అనుకున్నాడు. తల్లి వుంచిన బంగారు నాగరం, ఇరవై అయిదు రూపాయలూ సందుగ పెట్టెలోంచి గ్రహించి దాచేడు.

ఆనాటిరాత్రి రామంకి యేమీ నిద్రపట్టలేదు. "నవ్వినూళ్ళు పట్టణాలవకపోతాయా?" అని తాతయ్యన్నమాటలు పదేపదే జ్ఞాపకం వచ్చాయి. ఇహ నట్టేకాలం తానాయింట్లోవుండటంకన్నా ఇంకో వూరుకి లేచిపోవడం సమంజసమని తలిచేడు.

* * *

మూడేండ్లు గడిచిపోయాయి. బొంబాయిలో శ్యామసుందర్ అనే గొప్పగాయకుడు ఒక హిందీ ఫిల్ముకి మ్యూజిక్ డైరెక్టరుగా వుంటున్నాడు. మొదట్లో హిందీపాటలు తనకంత బాగా పాడ్డం రాకపోయినా, గాత్రం గలవాడవటంచేతనూ, మెలోడీగా చెప్పిన గీతాలు అప్పచెప్పగలగడం చేతనూ, రామాన్ని చేరదీసి గానంలోవున్న జిలుగులన్నీ శ్యామసుందర్ నేర్పేడు. ఇంతట్లో మద్రాసులో ఒక ఫిల్ముకి మ్యూజిక్ డైరెక్టరు హిందీబానీతో తెలిసినవాడు కావాలని పేపరులో యెడ్వర్టయిజుమెంటు చూసి, శ్యామసుందర్ రామంకి ధైర్యం చెప్పి మద్రాసుకి ప్రయాణంకమ్మని రూఢిచేసేడు. తనను ఇంత బాగుచేసి, తనని వో గాయకుడిగా మార్చిన గురువుని వదలిపోడానికి రామంకి మనస్కరించలేదు. "మీ ఋణం తీర్చలేకపోయాను గురువుగారూ! మీ ఆజ్ఞప్రకారం వెళ్ళి, మళ్ళీ మిమ్మల్ని దర్శిస్తా"నని నమస్కరించేడు.

"శుభంగా వెళ్ళు నాయనా! నీ అదృష్ట దినాలు యెదురు చూస్తున్నాయి త్వరగా వెళ్ళు. ఇదిగో నే నిస్తూన్న యీలేఖ కూడ చూపించు. అన్నీ జయంగా మారుతాయి" అని దీవించి మెయిల్ కి పంపేడు. రామం గురుని తల్చుకొని రైలులో కన్నీరు కార్చేడు. రైలు కదిలింది.

* * *

"రామం నువ్వు యిల్లు విడిచి నేటికయిదు సంవత్సరాలుకావచ్చేయి. నువ్వెక్కడున్నావో! యేం చేస్తున్నావో యేమీ నీ జాడ తెలియలేదు. నిన్ను మాటిమాటికీ బొజ్జీ; బొజ్జీ అని తలుస్తూ మూడు రోజుల క్రితమే తాతయ్యకూడ చనిపోయాడు. నీ కోసం మేమెంతో బెంగతో కుమిలిపోతున్నాము. కనుక నువ్విది చూచిన వెంటనే బయలుదేరిరావలెను" ఇట్లు నీ తల్లిదండ్రులు

నరసమ్మ - శీతారామయ్యలు

అని పేపరులోవున్న యెడ్వర్టయిజుమెంటు చూసి రామం కళాఫిలింసులో నిలువునా కూలబడిపోయాడు. తనిప్పుడు తాతయ్య చెప్పిన సూత్రాల కనుగుణ్యంగా పేరుపడ్డ మ్యూజిక్ డైరెక్టరయ్యాడు. తనను చూసి ఆనందపడే తాతయ్య యీ లోకానికి దూరమయాడు. తాతా! నువ్వు నన్ను బుజ్జగించిన మాటలకి అక్షరంకూడ తప్పకుండా అన్నీ జరిగాయి సుమా! నా సౌఖ్యాల్నిచూసి నువ్వు మురిసిపోతావనుకున్నా! కాని, కుంటి శనిగాడు నీమీద ఆవేశించి పడద్రోసేడు. ఇదంతా నాఖర్మ! నిన్ను చూసేభాగ్యం లేకపోయింది. నువ్వానాడు నన్ను వోదార్చిన పలుకులే శాశ్వతంగా లోకానికి రుజువు పర్చేయి. ఇప్పటికీ అవి నా హృదయంలో కదులుతూన్నాయి తాతా! నువ్వు చెప్పినది నిజం తాతా."

"అదృష్టాన్ని అడ్డేవారుండరు" అన్నావు కదా! అని విలపించి తాతయందున్న ప్రేమచే, శలవుపెట్టి యింటికి ప్రయాణమయాడు రామం!